# వర్ణ - అభేద - సహపంక్తి

సిరియాళరావు డిప్యూటీ కలక్టరు పని చేసి రిటైర్ అయిన మర్నాడే ఫస్టుక్లాసు బెంచిమేజస్ట్రేటుగా నియమింపబడ్డాడు. నియమింపబడ్డ మర్నాడే కాస్మోపోలిటన్ క్లబ్బులో మెంబరైనాడు. ఆఫీసర్సు క్లబ్బులోకూడా అయ్యాడని చెప్పుకున్నారుగాని. అసలు ఆఫీసర్సు క్లబ్బు వుందా లేదా అనే సందేహంమీద ప్రజ ఆమాట విశ్వసించింది లేదు. సిరియాళరావు తాను పింఛన్ తీసికోవడం ప్రారంభించింది లగాయతు "ఏంచేస్తున్నారండీ తమరిప్పుడు? తమకిప్పుడంతా విశ్రాంతి అనే అనుకుంటాము" అంటే జవాబుగా "సాంఘికసేవ," "అఖండ భారత్ సేవ" అని సమాధానం చెప్పేస్తూ వుండేవాడు. మరీ ఆంతరంగికుల్తో మందహాసంగా ఇలా వివరించేవాడు-"సాంఘికసేవ' అంటే 'పోకర్' 'రన్ మార్' 'బెట్‌బ్రిడ్జి' ఆడ్డమే అనుకోండి. ఎంచేతా అంటే. ఆసునుండి తివ్వదాకా. మధ్య రాజులున్నా రాణీలున్నా. జాకీలున్నా జోకర్లున్నా ఏకమొత్తంగా గుచ్చెత్తి కలిపేసి. విభేదం పాటించకుండా అక్కడముక్క ఇక్కడకు వచ్చేలాగు, ఇక్కడ ముక్క అక్కడకు వెళ్ళేలాగు 'రీషఫ్ల్' చేసి 'డీల్' చేస్తాం. అంతకంటె వర్ణసాంకర్యం, సరిసమానప్పంపకం నాకు మరెక్కడా కనిపించదు. అందుచేత ఇప్పుడు నేను సాయంకాలం మూడు మొదలు రాత్రి పదిన్నర దాకా పేకాట నిమగ్నుడనైయుంటూ వున్నాను. నేనేకాదు, నాతోపాటు మరి ముగ్గుర్నికూడా అమేషా అదే పనిలో మునిగి తేలేటట్లు చేస్తూవున్నాను. మా టేబిల్

వొక్కటే కాకుండా మమ్మల్ని మించి మరి ఆరు జేబిల్సు— వారికి కాలపరిమితికూడా లేదు — క్లబ్బులో వర్కు చేస్తూ వుంటాయి. వాళ్ళ భోజనభాజనాదు లన్నీ క్లబ్బులోనే. ఇఖ అఖండభారత సేవను గురించి విన్నవించమంటారా ?- ఈ అఖండ భారతసేవ అనేది నేను క్రాస్‌వర్డు పజిల్సుద్వారా చేస్తూవున్నాను. బ్రాకెట్సుద్వారా గావిస్తూవున్నాను. ఊరికే మీతో ' అఖండభారత సేవ ' అని న్యూనోక్తిగా వచించేనేగాని నాఆసేవ న్యూయార్కు పట్నానికికూడా తగిలి ప్రపంచసేవగా పరిగణింపబడి తీరుతుంది. క్రాసువర్డు పజిల్సుసంగతి మీకూ కొంచెమో గొప్పో ఈపాటికి తెలియకుండా వుండదు. మన ఇంగ్లీషుభాష అభివృద్ధి పొందు తుంది. మన కంతో ఇంతో ' లక్ ' వుంటే కిట్టింపూ అవుతుంది. మనకు కిట్టింపు కాకపోయినా మనం కట్టిన సొమ్ము ఒక లక్షమంది కైనా భూగోళంమీద వెదజల్లబడకమానదు. మరి బ్రాకెట్సు సంగతి అదో పెద్ద కిటుకు. ఇంతకూ నా కోరిక - తమరోనాడు మాయింటికి డిన్నర్‌కు దయచేయాలి " ఇదీతంతు. సిరియాళ రావుది—తాను డిప్యూటీ కలక్టరు హోదానుంచి విరమించినప్పటి నుంచీని. డిప్యూటీ కలక్టరుగా వున్నన్నాళ్ళూ రెండో విస్తరి ఇంట్లో పడనిచ్చిందిలేదు. ఎవరన్నా తనకు తేనీళ్ళుపోసి తనకు దండలు వేయాలిసిందేకాని. తా నొక్కళ్ళకు కప్పు కాఫీ ఇచ్చి ఒక్క వాడు గులాబీరేకు చేతిలోపెట్టిందిలేదు-ఏమనుకున్నారో ;

యాభైయైదువెళ్ళిన మర్నాట్నుంచీ ఎలా ఫిరాయించిందో అతగావి తత్వం పూర్తిగా ఫిరాయించింది. అయితే పెనిమిటికి తత్వం ఫిరాయించిందికావి భార్యకో ? ఆమెలో ఏమీ మార్పు కలగలేదు. ఆవిడ ఆచారాలేమిటో హరికథలేమిటో. ఉపోష్యా లేమిటో. ఉప్పిడిపిండేమిటో. నోములేమిటో. నొప్పులుపడ్డా

లేమిటో-అదే గొడవ ఆవిడ కిప్పటికీని. భర్త రేత్రి పంత్రెండు గంటల కింటికి వచ్చినాగానీ ఆదాకా అలా పీట తలగడాగా వాల్చుకొని పడమటింట్లో పండుకొని వుండడమే! పల్లెత్తు మాటనదు! "ఇప్పటి కిల్లూ, నేనూ జ్ఞాపకం వచ్చామా?" అని అడిగెరుగదు!!

ఇలా వుంటూవుండగా ఒకనాటిరేత్రి-అర్ధరేత్రి అని వేరే వక్కాణించ నవసరంలేదు - వచ్చీ వస్తూనే తన అర్ధాంగితో "రేపురేత్రి మనింట్లో డిన్నర్ ఒకటి ఏర్పాటుచేశాను. మామోలుగా వచ్చేలా ఒకడూ అరా అనుకునేవుగనుక-పంద్రెండు మందిని పిలిచాను. అందులో ఒకాయన సబుకలక్టరు. అంటే తెలుసునా? నేను రిటైరయిన హోదాకంటె పైది ఆయనహోదా! ఆయనమూలంగానే నేను 'బల్లతగవరి' నైంది. తెలుసునా? ఏలా చేస్తావో పదార్థాలు?" అన్నాడు.

భార్య మరి వోపిక పట్టలేక "ఉద్యోగంలో వున్నన్నాళ్లూ కమాను అనీ కచ్చేరీ అనీ వెలుపలే పుచ్చారు కాలం అంతా. ఉద్యోగంనుంచి విరమించి పిక్నిక్కులూ పేకాట్లూనా? ఇకెప్పుడు బుద్ధి వచ్చేది మీకు? కృష్ణా రామా అని అనుకొనే దేపూటా? నేను పొట్టువడియమైనా వేయించలేను. నేను వాళ్ళందరకూ ఉప్పురాయైనా వడ్డించలేను. మీరు ఎవరిచేతను వండింపించుకొని వడ్డింపించుకుంటారో చేయించుకోండి. ఇంతకూ వాళ్ళందరూ బ్రాహ్మణేతరు లనుకుంటాను. అసలు మీకు బ్రాహ్మణమిత్రులు పనికేరారుగా? అడగడమెందుకు?" అని చదివింది.

సిరియాళరావు "సబుకలక్టరుగారు బ్రాహ్మణులేగాని ఆయనక్కూడా నాలాగే అబ్రాహ్మణ సహపంక్తి అంటే మహా

యిష్టం. ఆయన దాన్నే వర్ణ-అభేద-సహపంక్తి అని మరో పేర విశదీకరిస్తాడు. ఈ వర్ణ-అభేద-సహపంక్తి అంటే ఆయనకు మహాయిష్టం. అంచేత పేకాటన్నేహితుల్ని మరినలుగుర్ని జత చేసి 'డిన్నర్'కు ఆహ్వానించాను. నీ వ...ల్లూ, నీ పడమటిల్లూ, నీ దేవుడరుగూ. దీపంజ్యోతీ మైలడిపోతాయి అంటే పక్కగా డాబా సావిట్లో విస్తళ్ళు వేసి వడ్డించు" అన్నాడు చెక్కు చెదరకుండా.

"అదిగో అక్కడేవుంది మీరంటే నాక్కోపం! వడ్డించు అంటున్నారు పళ్ళెవి — ఎవరు వడ్డిస్తారు? అసలు ఎవరు వండుతారు వీళ్ళందరికీని? ఉపకారవేతనం అయినప్పట్నుంచీ మా పిన్నిఏకూడా ఇంట్లో వున్నియ్యకుండా వెళ్ళగొట్టేశారు!" అని వెక్కి వెక్కి యేడ్వసాగింది ఇల్లాలు.

ఆ యేడుపు వినకుండానే సిరియాళరావు "మీ పిన్నిముండ ఎక్కడకు వెడుతుంది? దానికీ ఈవూరి సినిమాలో కావికీ ఎడతెగని లంకె. ఇక్కన్నే వుండివుంటుంది. కబురెట్టి కనుక్కో రేపురాత్రి మాటదక్కిస్తుందేమో!" అన్నాడు.

భార్య కొంచెం తేరి అంది: "నేనామెనుచూచింది మూణ్ణెళ్ళక్రితం. మీరు చూచారేమో ఈమధ్య. మీరే కబురెట్టండి! వస్తుంది. రాకేంచేస్తుంది? నాలుగురూపాయలు చేతిలో పెడితే మహచక్కగా వస్తుంది."

సిరియాళరావు కబురుచేస్తేనే వచ్చిందో, లేక ఆమె స్వయంగా రావాలనేవచ్చిందో, పిన్ని అన్న ఆవిడ తిన్నగా సిరియాళరావుగారి యింటికి మర్నాటిమధ్యాహ్నానకు విచ్చేసింది. అప్పటికప్పుడే కావలసిన సామానంతా-జీలకర్రనుంచి సింబాదం పప్పు వరకూ తట్టల్తోటీ తబేళాల్తోటీ వచ్చిపడివుంది ఇంట్లో.

పిరియాళరావు భార్యపేరు శ్యామలాంగి తన పిన్నిని చూస్తూనె "వచ్చావుటే పిన్నీ? మా ఆయన కబురెట్టారా?" అని అడిగింది. అంటే పిన్ని—"మీ ఆయనకూ లేదు సిగ్గు - నాకూ లేదు. ఒకడు కబురెట్టేదేమిటే మనయింటికి మనం రావడానికి? మీ యింట్లో ఈరాత్రి 'డిన్నరు'టగా!" అంది. "అదే ఆలోచిస్తున్నాను. వండేవాళ్లులేరు. వడ్డించేవాళ్లూ లేరు" అంటూ శ్యామలాంగి తన పిన్నియొక్క నుదురుకేసి చూస్తూ ముంగురులకు బదులు ముసుగు అగపిస్తే "ఇదేమిటే పిన్నీ! ఇదెప్పట్నుంచి చేయించావే?" అని అడుగుతూ కంట నీరెట్టుకుంది. పిన్నికూడా అంతోయింతో కన్నీరు విదిపికొని "ఇదేనమ్మా! ఆడదాని అప్రతిష్ఠ అగచాటూను. మొన్న పుష్కరాలకు తీయించేచానే. ఎన్నాళ్ళీజుత్తు" అని ముసుగు సర్దుకుంది.

శ్యామలాంగి—"వచ్చేవాళ్లు అందరూ ఉద్యోగస్థులు. కూర్చునేది వర్ణ-అభేద- సహపంక్తి అన్నారు మావారు.

"అయితే ముసుగువేసుకు వడ్డిస్తే బ్రాహ్మణాచారమైపోతుం దంఛావు!"

"ఉఁ."

"ముసుగు తీసేసికొని వడ్డిస్తేనో?" అని పిన్ని అభినయించింది. ఆ అభినయానకు ముందే "ముసుగుతీసి వడ్డిస్తే బలే పసందుగా వుంటావులే" అని శ్యామలాంగి విరగబడి నవ్వింది.

గడియారం ఆవల సాయంకాలం మూడుకొట్టింది. ఇద్దరూ కూడా విన్నారు. "నీ మర్యాదకు లోపంలాకుండానే వండినే వడ్డిస్తే సరికదా. వెయ్యిమంది నానా కులాలవాళ్ళూ వచ్చి

కూర్చున్నా జగన్మోహినిలా వడ్డించగలను నేను. చూతుగాని ఈ రేత్రి నా వేషం. నీ మొగుడూ వాళ్లతోటి సరాసరి కూర్చుని భోంచేస్తాదే?" అని బుగ్గను వేలేసుకుంది పిన్ని.

"అందుకనేగా యీ మొత్ర. వంటింట్లో అయినా, పదమటింట్లో అయినా అయితే నేనే వడ్డిస్తును. డాబాసావిట్లోట సహపంక్తి!"

"ఇంకా ఆచారం అన్నది యీ కొంపలో నీమూలంగా నిలబడివుంటూవుంది అనుకో!"

అని పిన్ని చరచరా నూతిదగ్గరకు వెళ్ళి స్నానంచేసి, మడిగట్టుకు సాయంకాలం దీపాలవేళకల్లా వంట—సిరియాళరావు పురమాయించిన ప్రకారానికి ఉల్లిరేకూడా తేడా రాకుండా తయారుచేసింది. చేసి "యిప్పుదే వస్తున్నా! చూస్తూవుండు; పదార్థాలు చల్లారిపోకుండా, పిల్లి ముట్టుకోకుండా మాఅమ్మా!" అని ఎక్కడికో చక్కాపోయింది.

మళ్ళీ వడ్డనప్పుడే పిన్నిని మనం చూడ్డం. ఉడుత తోక కుచ్చువంటి జడచివళ్ల. జడ ఏమో నల్లత్రాచు! ముందుకు ముంగురులు చెంపలకింద కిందకూడా అదేమాదిరి. నున్నని దువ్వు, వెనుకపీఠిని పువ్వు—ఇలాగ్గా భేషైన సువాసినీరూపం దాల్చింది. చేతుల్ని గాజులెట్టుకుంది. మెళ్లోహారాలు వేసుకుంది. కాళ్ళను ఘల్లుఘల్లుమనే గొలుసు లుంచుకుంది. వొయ్యారి పడుచంటే వొయ్యారిపడుచు అన్నట్టు నడుస్తూ వడ్డిస్తూవుంది.

భోజనానికి కూర్చున్నవాళ్లందరికీ బలే ఆశ్చర్యంగావుంది. పదార్థాలుచూస్తే తినాలనివుంది. తినకుండా ఆపిన్ని - ఆ వడ్డించే ఆపిన్ని చూడాలనీవుంది. చివరకు ఆమె వచ్చి, నేతిగిన్నె చేత

పట్టి "కూర్చోండి అయ్యల్లారా!" అని అనేదాకా ఒకళ్ళ అర చెయ్యీ అన్నంమీద పడలేదు. ఒకప్పుడమూ విరగలేదు. విందుకు వచ్చినవారిలో వొక్కరూ సిరియాళరావును "నీ కేమౌ తుందోయి ఈవిడ?" అని అడక్కుండానే ఎదో చూపులకు చూపు లంపుకుంటూ భోజనం చేయసాగారు. సిరియాళరావు మాత్రం మధ్యమధ్య "మొఖమోటం పడకుండా భోజనం చెయ్యాలి సుమండీ! మీరు మొఖమోటపడ్డారా అంటే మీ యింట్లో డిన్నరుకు నేనూ మొఖమోటపడవలసి వస్తుంది" అనేవాడు. "ఇంతకూ పదార్థాల షడ్రుచులు బాగావున్నాయి. వడ్డించే ఆవిడ షోడశ రుచుల్తో వడ్డిస్తూవుంది—మాకు కొదవేమిటి" అని ఏ అతిథిమట్టుకాఅతిథే స్వగతంగా అనుకుంటూ పైకి "సిరియాళ రావూ! ఇలాంటి డిన్నర్ మరొకటి నీవే యివ్వాలోయి! ద్వితీయ విఘ్నం పనికిరాదుసుమా!" అని అభినందించారు. సిరియాళరావు "ఏ డిన్నర్ ఆకలి ఆ డిన్నరుదే-వేయించుకోండి మరిరెండు ఒబ్బట్లు" అన్నాడు కొంచెం ఉబ్బి. క్రమేపీ సంతోష సంభాషణ 'మట్టన్' నుంచి మహిషి దధిదాకా భోజనంతోపాటు జరిగింది. దధిదగ్గరకు వచ్చేసరికి, ధవళం దధి—మంచి కరడు పెరుగు వడ్డిస్తూవుంది పిన్ని! "ఇంటిగేదా?" అని పంక్తిలో మొదటివాడు అంటే సిరియాళరావు "గేదెల్లో ఇదివరకు గవిడి గేదెను గురించి విన్నాను గాని ఇంటిగేదెను గురించి వినలేదు" అంటూ తన అన్నం తాను కలుపుకుంటూ వున్నాడు. సబుకలక్టరు హోదామాన్యుడు "అదికాదోయి: గుమ్మంముందు పితికిస్తున్నావా, పెరట్లో మేపిస్తున్నావా, గేదెను? రెండోరకాంది అయితే ఇంటి గేదె" అన్నాడు. సిరియాళరావు "మన రంగన్న అన్న పూర్వ

సువాసినీ వ్యాఖ్యానంలాగేవుంది ఇదీని " అన్నాడు. చంద్రన్న అనే పేకాట హీరో అదివరలో ఆ వ్యాఖ్యానం తాను ధప్పళం కలుపుకోవడంలో వినకనో. లేక కేవలం ఆవిడమీదనే ధ్యానం వుంచుకునో. ఎరక్క " ఏమిటి ఆ వ్యాఖ్యానం " అని అడిగాడు. మున్ను విన్న నాగోజీ ఇలా చెప్పేడు గొంతుకూర్చుని త్రేంచుకుంటూ—" అవడ పూర్వ సువాసినీరూపం గారి, భూలోకంలో ముందు సువాసిని అయి పసుపుపోయి స్త్రీ పూర్వసువాసిని అవుతుంది. ఈ భోజనలోకంలో ముందు పూర్వసువాసిని అయి గారి అనే పదార్థం తరువాత పసుపుకలిసిన మెంతి పెరుగు తగిలి-తగలడమేమిటి? మెంతిపెరుగులో బాగా తడిసి-తడియడమేమిటి నాని-సువాసిని అవుతూవుంది " అన్నాడు.

ఈ వ్యాఖ్యానాల దోసందులో. ముక్తాయింపులో పంక్తిలోవి కడవానివద్ద ఓగమ్మత్తు జరిగింది: పిన్ని జడ ముందుకేసుకు వడ్డిస్తూ వుంది! అసలు జడన్నది ఆడవాళ్ళ వంటిమీద ఓచో చెప్పుడు నిలకడగా వున్నది కనక? ఓ పర్యాయం పిరుదుల్ని పింపిళ్లు కూస్తుంది. ఓ పర్యాయం ఆ బుజాన్నిపడి వెనక్కు మొలను చుట్టేస్తుంది. ఓ పర్యాయం ఈ బుజాన్నిపడి ముందు మడమలమధ్య పడుతుంది. అందులోనూ ఉడుతతోక కుచ్చు దేమో, వడ్డించే పెరుగుతోకలిసి విస్తట్లో పడింది చటాల్న. అతడు—ఆ విందులోని ద్వాదశార్కుడు " పెరుగులో వెంట్రుకలున్నట్టున్నాయి. ఇది నాన్ వెజిటేరియన్ పెరుగ్గావుంది " అని ఆ కుచ్చులోని వో వెంట్రుక అలా తీసి పారేసినట్టు లాగి పారెయ్యబోయాడు.

దాంతో వడ్డించేఆవిడ 'విగ్' 'విగ్' ఊడి విస్తట్లో పడింది. ఆమె—మన పిన్ని సిగ్గుపడిపోతూ పెరుగుతప్పేలా అక్కడ జారేసి వంటింట్లోకి "వల్లకాటితిక్క వల్లకాటి లోకం" అనుకుంటూ తిరోహిత అయింది. సిరియాళరావూ, తక్కిన ఎలివెన్ నిర్ఘాంతపోసాగారు. పన్నెండో ఆతడు "పెరుగులోకి వెంట్రుకేకాదు, విగ్ విగ్గే వచ్చిందోయి" అంటూ ఆ విగ్గును సిరియాళరావు విస్తట్లోకి విసిరాడు. సిరియాళరావు "ఎక్స్క్యూజు చెయ్యాలి" అన్నాడు. సబ్ కలక్టరు హోదా ఆయన "It is a nice ending—మంచి ముగింపు" అన్నాడు.

ఎంత మంచి ముగింపు అని అన్నా సిరియాళరావు, ఆపూట ఆ పన్నెండుగురూ తానూ మూడుతెగలుగా ఆ రేత్రి మూడుగంటల్దాకా ఆడిన పేకాటప్పుడుకూడా అంతో యింతో చిన్నబుచ్చుకోక తప్పిందికాదు.

శ్యామలాంగికీ, పిన్నికీ తొలికోడి కొక్కొరోకో అనేదాకా భోజనమేలేదు.

సిరియాళరావు స్నేహితులవద్ద సెలవు తీసుకు వీధితలుపు గెడవేసికొంటూ, వంటింట్లో ఇంకా చప్పుడౌతూవుంటే వెళ్ళి "చూడండి అత్తా! ఇప్పుడు ఉద్యోగస్థుల్లో నూటికి తొంభై మంది వర్ణ అభేదపు తంతుగాళ్ళు. ఏంచెయ్యగలం మనం?" అన్నాడు. శ్యామలాంగి కిమన్నాస్తి. మాట్లాడలేకపోయింది గాని పిన్ని మాత్రం "విగ్ జాగర్తచేశావా?" అని అడిగింది. అడుగుతూ ఇంకా నిర్వచించింది: "ఈ రోజుల విగ్గుల్లో నూటికి తొంభై విగ్గులు వర్ణ అభేదానివే. ఎక్కడోకాని అంతా నల్లగా వున్న విగ్గే కానరాదు బజార్లో. పెరుగులో పడి తెలుపనిపించిందేమో

కావి తిరిగి పరిశుభ్రం చేస్తే ఏలా ఉంటుందనుకున్నారు ఈవిగ్! బ్రహ్మాండంగా కాటుకపిట్టలా వుంటుంది" అని సిరియాళరావు చేతిలోంచి ఆ విగ్గున్నూ, విగ్గుతోకూడా ఓ వరహా రొక్కమున్నూ అందుకుంటూ—"పిల్లా! వెళ్లొస్తా" నంటూ శ్యామలాంగికేసి చిరునవ్వు నవ్వుతూ, పిన్ని వీధమూల మలుపు తిరిగింది. ఆకాశపు తూరుపు వారగునే అరుణకాంతులు ఆమె పెదవుల్ని ఉదురొక్కన్నాయి!

## ఉప్పాలం

గుంటూరు రేపల్లె, చీరాల, బందరు ఆ ప్రాంతపు సముద్రతీరపు వంచకు "ఉప్పాలం" అని పేరు. చవుడుదేరి నేల మృదువుగానుండి ఉప్పుజాడతో కూడుకొన్నదై చాలబాగము పెద్దబయలుగా తోస్తూ నీరు గాలితోను మైకంగా చల్లందనం, మన కనురెప్ప లెగయ గుప్పిస్తుంది. దూరదూరంగా ఎత్తైన సరుకుమొక్కలచాళ్లు తూగుతూ వినువాడెంత పరధ్యానంగా వున్నా తమ సంగీతాన్ని వినిపిస్తూవుంటాయి. అక్కడక్కడ నివాసయోగ్యాలుగా భావించి మానవులు నిర్మించుకొన్న ఊళ్లు రెండుకోసుల్లో మూడుకోసుల్లో అడ్డదిడ్డపు తోవలతో అల్లుకుపోయి కనబడతాయి. ఆ గ్రామాదుల పేళ్లుకూడా సముద్రతీరప్రాంతాన్ని బట్టి పుట్టివుంటాయి అవి అనుకొనేటట్టుగా—ఇసుకపల్లె, దిండి, కట్టవ, యిలా పిలవబడుతూవుంటాయి. కొండల్లోపుట్టి కొండల్లో పెరిగిన కోయవాని కలాంటి తావొకటి భూమ్మీద వుంటుందా అని అనిపించకమానదు.